




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 4-8-2025

సంపుటి: 21 సంచిక: 113

పేజీలు: 8 వెల: రూ.1


# కూటమిగా గెలిచారు.. పార్టీగా ఓడారు!

- ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా టీడీపీలో వింత పరిస్థితి
- పాలకొండ, ఎచ్చెర్లలో మిత్రపక్షాల ఎమ్మెల్యేతో ఇక్కట్లు
- శ్రీకాకుళం, పాతపట్నంలలో సొంత పార్టీలోనే సెగలు
- ఒకరి వద్దకు వెళితే ఇంకొకరికి కోపం
- ఎవరి వద్దకు వెళ్లినా ఆ గ్రూప్ వారని ప్రచారం



హోంమంత్రి కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

**శ్రీకాకుళం నియోజకవర్గంతో పాటు పాలకొండ, పాతపట్నం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకత్వం ఓ వింత పరిస్థితిని ఎదుర్కొంటోంది. 'కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం' అన్నట్లు తయారైంది వీరి పరిస్థితి. గత ఎన్నికల్లో ఈ నియోజకవర్గాల్లో టీడీపీ నాయకత్వం ప్రయోగాలు చేయడమే ఈ పరిస్థితికి కారణం. అలాగని దీన్ని విఫల ప్రయోగం కాదు. ఈ నాలుగుచోట్లా టీడీపీ కూటమి నిలబెట్టిన అభ్యర్థులు ఘనవిజయం సాధించారు. కానీ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు మాత్రం పాత, కొత్త నాయకుల మధ్య అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతున్నారు. కొన్నిచోట్ల సిటింగ్ ఎమ్మెల్యేలకు మరోసారి టికెట్ దక్కకుండా చేసే ప్రయత్నాలు ప్రారంభం కాగా మరికొన్ని చోట్ల ఎమ్మెల్యే మీద పైచేయి సాధించేందుకు జరుగుతున్న కుట్రల్లో కేడర్ బలిపశువులైపోతున్నారు.**



హోంమంత్రి కోసం ఎదురుచూస్తున్న టీడీపీ కేడర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పాతపట్నంలో మామిడి గోవిందరావుకు టిక్కెటివ్వడంతో ఇన్నాళ్లు కలమట రమణతో పయనించిన టీడీపీ కేడర్ ఇప్పుడు మామిడి గోవిందరావు వెంట నడుస్తోంది. అయితే కలమట ఇప్పటికీ ఎమ్మెల్యే మీద పైచేయి కోసం ప్రయత్నిస్తున్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు కూడా తానే కావడం ఆయనకు కలిసొచ్చింది. తెర వెనుక రహస్య ఒప్పందాలు, వ్యాపారాలు కలిసి జరుపుకొంటున్నా బహిరంగంగా మాత్రం పరస్పరం కత్తులు దూసుకుంటున్నారు. దీనివల్ల పార్టీ జిల్లా అధ్యక్షుడి దగ్గరకు వెళ్తే ఎమ్మెల్యేకు, ఎమ్మెల్యే దగ్గరకు వెళితే పార్టీ అధ్యక్షుడికి కోపం వస్తుందని దీన్నే గ్రూపులుగా మలిచేశారన్న భావన, ఆవేదన కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది.

### ఎమ్మెల్యే వద్దకు వెళ్తే ఇన్‌ఛార్జికి కోపం

పాలకొండలో అప్పటి వరకు టీడీపీలో ఉండి జనసేన తరఫున పోటీ చేసిన జయకృష్ణ ఎమ్మెల్యే కాగా, టీడీపీలో ఉన్నప్పుడు ఆయన్ను వ్యతిరేకించిన వర్గమంతా ఎమ్మెల్యే వద్దకు వెళ్లిన వారిపై కత్తికడుతోంది. దీనికి తోడు ఎమ్మెల్యేను వ్యతిరేకిస్తున్న పడాల భూదేవి పాలకొండ టీడీపీ ఇన్‌ఛార్జిగా ఉండటం, ఆ జిల్లాకు మంత్రి అచ్చెన్నాయుడే ఇన్‌ఛార్జి మినిస్టర్ కావడంతో కార్యకర్తల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టయింది. కళా వెంకటరావు శిష్యుడిగా రాజకీయాల్లోకి వచ్చిన నిమ్మక జయకృష్ణకు, జనసేనకు వాస్తవానికి సంబంధం లేదు. పొత్తుల్లో భాగంగా ఆయన జనసేన గుర్తుపై పోటీ చేశారు. ఇప్పుడు ఆయన ఎమ్మెల్యే అయినందున జనసేనే కాకుండా టీడీపీ కేడర్ కూడా ఆయన క్యాంప్ కార్యాలయానికే వెళ్లాల్సి వస్తోంది. కానీ ఎమ్మెల్యే ప్రమేయం లేకుండానే అసమ్మతి నాయకుల పనులు అక్కడ చకచకా జరిగిపోతున్నాయి. వడ్డించేవాడుండటంతో కడఫంక్తిలో ఉన్నా ఆకులో అన్నీ సమకూరుతున్నాయి. ఎటొచ్చీ ఎమ్మెల్యే వద్దకు వెళ్లిన వారిపై గ్రూపు ముద్ర పడుతోంది.

### ఆయన వద్దకు వెళ్లారా.. అని ఆరా

ఎచ్చెర్లలో బీజేపీ నుంచి నడికుదుటి ఈశ్వరరావు (ఎన్‌ఈఆర్) ఎమ్మెల్యే కాగా రణస్థలానికి చెందిన కలిశెట్టి అప్పలనాయుడు విజయనగరం ఎంపీగా తెలుగుదేశం తరఫున గెలిచారు. స్థానికంగా పనులు కావాలంటే ఎమ్మెల్యే వద్దకు వెళ్లాలి. ఎన్నికల ముందు వరకు ఎచ్చెర్ల నియోజకవర్గ టీడీపీ కేడర్ అయితే కళా వెంకటరావు లేదా కలిశెట్టి అప్పలనాయుడు వద్దకు వెళ్లేది. అప్పలనాయుడు విజయనగరం ఎంపీ అయినా, ఆయన స్వస్థలం రణస్థలం. ఎన్‌ఈఆర్ ఉండేది కూడా రణస్థలం మండలం బంటుపల్లిలోనే. ఇక్కడ ఎమ్మెల్యే, ఎంపీల మధ్య తెలుగుదేశం నేతలు నలిగిపోతున్నారు. ఎన్‌ఈఆర్ బీజేపీ తరఫున గెలిచినా ఆయన మాతృసంస్థ టీడీపీయే. ఏదైనా సమస్య పరిష్కారం కోసం ఎంపీ వద్దకు ఇంతకుక్రితమే వెళ్లారా? అని ఎమ్మెల్యే వర్గం ఆరా తీసిన తర్వాతే ఇక్కడ అపాయింట్‌మెంట్ ఇస్తున్నారని తెలుస్తోంది.

### హోంమంత్రి పర్యటనలో గుండ లక్ష్మీదేవి హడావుడి

తాజాగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆదివారం అరసవల్లి సూర్యనారాయణస్వామిని దర్శించుకోడానికి వచ్చారు. ఈ విషయం ఎలా లీకైందో తెలీదు గానీ అరసవల్లిలోనే ఉంటున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఓ చీర పట్టుకెళ్లి అనితకు దగ్గరుండి దర్శనం చేయించారు. హోంమంత్రి కూడా మాటకు ముందు ఒక సారి, మాటకు తర్వాత ఒకసారి లక్ష్మమ్మ అంటూ తన భక్తిని చాటుకున్నారు. అంతవరకు హోంమంత్రి వస్తారని పెద్ద ఎత్తున చేరిన నగర టీడీపీ నాయకులు లక్ష్మీదేవి రాకతో చెల్లాచెదురైపోయారు. కాగా ముందుగానే నిర్ణయించుకున్న ప్రోగ్రాం ప్రకారం ఎమ్మెల్యే గొండు శంకర్ తన సతీమణి గొండు స్వాతితో కలిసి తిరుపతి దర్శనానికి వెళ్లారు. తాను ఊరిలో లేకపోవడం వల్ల రాలేకపోతున్నానని, నగర పార్టీ నాయకుడు మాదారపు వెంకటేష్ నేతృత్వంలో పార్టీ డివిజన్ ఇన్‌ఛార్జిలు వస్తారంటూ శంకర్ హోంమంత్రికి సమాచారమిచ్చారు. కానీ లక్ష్మీదేవి

- మిగతా చివరి పేజీలో



# కో-లివింగ్.. ఇదో రకం సహజీవనం!

- హైదరాబాద్, బెంగళూరుల్లో పెరుగుతున్న కొత్త కల్చర్
- పరిచయం లేకుండానే ఒకే గదిలో యువతీయువకుల నివాసం
- మామూలు స్థాయి నుంచి హైటెక్ హంగులతో అద్దెకు రూములు
- సమాజానికి, సంప్రదాయాలకు చేటు చేస్తుందని ఆందోళన

**మన దేశంలో వివాహ బంధాన్ని అతి పవిత్రమైనదిగా భావిస్తారు. ఏ మతస్తులైనా.. ఏ వర్ణం వారైనా.. వారి వారి సంప్రదాయాల ప్రకారం ససాక్ష్యంగా, శాస్త్రోక్తంగా వివాహ బంధంలోకి అడుగుపెట్టేవారినే సమాజం, ప్రభుత్వాలు దంపతులుగా గుర్తిస్తాయి. కానీ కాలక్రమంలో వివాహ వ్యవస్థను కాదని కలిసి ఉంటూ పెళ్లి చేసుకోకపోయినా భార్యాభర్తలుగా చెలామణీ అవుతున్నవారి సంఖ్య భారీగా పెరిగిపోయింది. పట్టణాలు, నగరాల్లో ఈ సంస్కృతి కామన్‌గా మారిపోయింది. ఇప్పుడిది మరింతగా పక్కదారి పడుతోంది. వివాహం, సహజీవనం వంటివి కాకుండా కేవలం ఆర్థిక అవసరం రీత్యా యువతీయువకులు కలిసి ఉండటానికి వెనుకాడటం లేదు. దీన్నే 'కో లివింగ్' అంటున్నారు. అంటే కలిసి నివసించడం అని అర్థం. హైదరాబాద్ వంటి మహానగరాల్లో ఈ కల్చర్ పెరిగిపోతుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. దీని వల్ల సంప్రదాయాలు మంటగలవడమే కాకుండా హత్యలు, అత్యాచారాలు వంటి దారుణ ఘటనలకు దారితీస్తున్నాయని అంటున్నారు.**

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

పాఠశాల, కళాశాల స్థాయిలో విద్యార్థులు, విద్యార్థినులకు ప్రభుత్వం వేర్వేరుగా హాస్టళ్లను నిర్వహిస్తుంటుంది. అలాగే గ్రామాల నుంచి నగరాలకు వచ్చి ఉద్యోగాలు, ఇతర ఉపాధి పనులు చేసేవారికి వసతి కల్పించేందుకు వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు వంటివి నడుస్తుంటాయి. కొందరు తమ ఇళ్లలోనే అదనంగా ఉంటే గదులను అబ్బాయిలు లేదా అమ్మాయిలకు అద్దెకు ఇస్తూ.. కోరితే భోజనం కూడా పెడుతూ దానికి సరిపడా నెలవారీ ఛార్జీలు వసూలు చేస్తుంటారు. దీన్నే పేయింగ్ గెస్ట్ విధానం అంటుంటారు. ఇంతవరకు ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ ఇటీవలి కాలంలో ఈ పేయింగ్ గెస్ట్ కల్చర్ సంకరమవుతోంది. ఒకే గది లేదా ఇంటిని ఇంతకుముందు ఎటువంటి పరిచయంలేని ఆడామగా వ్యక్తులను అద్దెకు ఇస్తూ కొత్త పేయింగ్ గెస్ట్ సంప్రదాయానికి ఈమధ్య కాలంలో హైదరాబాద్ నగరం తెరతీసింది. ఇళ్ల యజమానులే ఈ అవకాశం కల్పిస్తుండగా ఉద్యోగులైనా మహిళలు, పురుషులు కూడా పరిచయం, ప్రేమ, బంధుత్వం లేకుండానే కలిసి ఉండటానికి సుముఖత చూపుతుండటం విస్మయం కలిగిస్తోంది. ఇటువంటి వారికి ఇంటి యజమానులే నిర్ణీత ఛార్జీలతో భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తుంటారు. లివింగ్ కల్చర్ కొంతకాలంగా హైదరాబాదులో బాగా పెరిగిపోతోంది.

### ఉత్తరాదివారే అధికం

దేశంలోని అన్ని ప్రాంతాలకు హైదరాబాద్ గమ్యస్థానంగా మారింది. అన్నీ రాష్ట్రాల నుంచి ఉపాధి, ఉద్యోగాలు, ఉన్నత విద్య పేరుతో చాలామంది ముఖ్యంగా యువత ఈ నగరానికి వస్తున్నారు. సొంత ఊళ్లకు, తల్లిదండ్రులకు దూరంగా ఇక్కడ ఉంటూ ఉద్యోగ, ఉపాధి పొందడాన్ని చాలామంది స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వచ్చినట్లుగా భావిస్తున్నారు. ముఖ్యంగా పెద్దవాళ్ళ అదుపు లేకపోవటంతో కో లివింగ్ కల్చర్ వైపు తొందరగా ఆకర్షితులవుతున్నారు. ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల నుంచి హైదరాబాదుకు వస్తున్న యువత అంతా కో లివింగ్‌కే మొగ్గు చూపుతున్నారు. వారి మధ్య భాషా సమస్య లేకపోవటం దీనికి ఒక కారణంగా భావిస్తున్నారు. బెంగుళూరులో ఉద్యోగం చేసి ఇటీవలే హైదరాబాద్‌కు మారిన ఒక బీపీవో ఉద్యోగి మాట్లాడుతూ తాను బెంగుళూరులో ఉన్నప్పుడు ఒక అమ్మాయితో కో లివింగ్ పద్ధతిలోనే ఉన్నట్లు చెప్పాడు. ఇప్పుడు హైదరాబాదులోనూ ఉత్తరాదికి చెందిన అమ్మాయితో కో లివింగ్ పద్ధతిలోనే కూకట్‌పల్లిలో ఉంటున్నట్లు చెప్పాడు. ఇద్దరికీ ఇష్టం ఉన్నంత కాలం ఉంటాం.. కుదరకపోయినా నో ప్రాబ్లెమ్.. వేరే వాళ్లను వెతుక్కుంటామని చాలా తేలికగా చెప్పేశాడు. కో లివింగ్ పద్ధతిలో వసతి సౌకర్యాన్ని షేర్ చేసుకోవడానికి ఇష్టపడే యువతుల్లో ఎక్కువమంది ఉత్తరాదివారే కావడం విశేషం. హైదరాబాదు, తెలంగాణ, ఏపీకి చెందిన యువతులు ఈ పద్ధతి వైపు పెద్దగా మొగ్గు చూపడం లేదు. కారణం ఏమిటంటే.. ఏ రోజైనా సడెన్‌గా తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు, తెలిసిన వారు ఎవరైనా రావచ్చు. వేరే యువకుడితో కలిసి ఉంటున్నామని ఇంట్లో తెలిస్తే పెద్ద గొడవైపోతుందన్న భయంతోనే హైదరాబాద్‌లో ఉంటున్న తెలుగు రాష్ట్రాల అమ్మాయిలు కో లివింగ్ పద్ధతికి దూరంగా ఉంటున్నారట! అదే ఉత్తరాది నుంచి హైదరాబాదు చాలా దూరంలో ఉంది. ఆ ప్రాంతాల నుంచి సడన్‌గా వచ్చే అవకాశం ఉండదు. పైగా వచ్చే ముందు సమాచారం ఇస్తారు కనుక వారు వచ్చే సమయానికి కో లివింగ్ పార్టనర్‌ను బయటకు పంపేస్తుంటారు. వచ్చిన వాళ్లు వెళ్లిపోయిన తర్వాత మళ్లీ అంతా మామూలే.

### ఖర్చులు తగ్గించుకోవడం మరో కారణం

ఉద్యోగరీత్యా హైదరాబాద్ వంటి మహానగరంలో ఉండక తప్పని పరిస్థితి కొందరిది. కానీ ఒక్కరు ఉండటానికి ఇళ్ల అద్దెలు, రూము రెంట్లకే పెద్ద మొత్తంలో వెచ్చించలేని పరిస్థితి. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో తమతో రూము షేర్ చేసుకుని.. అద్దె భారం తగ్గించుకోవాలనుకుంటున్న వారు కో లివింగ్ వైపు మొగ్గు చూపుతున్నారు. కో లివింగ్‌ను ప్రోత్సహిస్తున్న ఇళ్ల యజమానులు భారీగానే డబ్బులు వసూలు చేస్తున్నారు. బెంగుళూరులో అయితే కో లివింగ్ పద్ధతిలో అద్దెకు తీసుకునేవారు ఏ కంపెనీలో ఉద్యోగాలు చేస్తున్నారు? జీతభత్యాలు ఎంతన్న వివరాలు తెలుసుకుని మరీ నిర్వాహకులు అద్దెకు ఇస్తున్నారు. అ వివరాలు నిర్ధారించుకునేందుకు కంపెనీల ఐడీ కార్డులు, మూడు నెలల జీతభత్యాల బ్యాంకు స్టేట్మెంట్లు కూడా చూస్తారు. వీటి ఆధారంగానే అద్దెలు, డిపాజిట్లు నిర్ణయిస్తారు. హైదరాబాదులో కంపెనీ ఐడీ కార్డులు, బ్యాంకు స్టేట్మెంట్లు అడగకపోయినా ఇస్తున్న బస, వసతి సౌకర్యాలను బట్టి అద్దెలు వసూలు చేస్తున్నారు. లగ్జరీ హోటల్ స్థాయిలో సౌకర్యాలున్న కో లివింగ్ గదులకు నెలకు ఒక్కొక్కరి నుంచి రు.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. హైటెక్ సిటీ, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, జూబ్లీహిల్స్, కావూరి హిల్స్ ఏరియాల్లో ఇటువంటివి ఎక్కువగా ఉంటున్నాయి. లగ్జరీ కో లివింగ్ గదుల్లో 24 గంటలూ ఇంటర్నెట్, కిచెన్, లాండ్రీ, డాక్టర్ ఆన్ కాల్, డైనింగ్ వంటి సర్వ సౌకర్యాలు కల్పిస్తున్నారు. మామూలు స్థాయిలో కో లివింగ్ గదుల అద్దెలు నెలకు కనీసం రు. 15 వేల వరకు ఉంటాయి. ఇక్కడ కో లివింగ్ అంటే ఒక గదిలో ఒక అబ్బాయి, ఒక అమ్మాయి కలిసుండటమే కాదు. ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు కూడా కలిసి ఉండవచ్చు.





### వ్యతిరేకత ఎందుకంటే..

కో లివింగ్ కల్చర్‌పై వ్యతిరేక ప్రచారం కూడా తీవ్రంగానే ఉంది. సమాజంలో లవ్ మర్డర్స్ పెరిగిపోతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ఆ మధ్య ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో పెరుగుతున్న కో లివింగ్ కల్చర్ వంటి వాతావరణం చెడిపోతోందని, ఇదే హత్యలు ఇతరత్రా వివాదాలకు కారణమవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది మంచి సంస్కృతి కాదని అభిప్రాయపడ్డారు. అయితే ఇది తప్పుడు ప్రచారమని ఒక కో-లివింగ్ నిర్వాహకుడు వ్యాఖ్యానించారు. కో లివింగ్ అంటే 'కమ్యూనిటి లివింగ్' అని కొత్త అర్ధం చెప్పాడు. 2017లో తమ కంపెనీ మొదటి కో లివింగ్ పద్దతిని గచ్చిబౌలిలో మొదలుపెట్టిందన్నాడు. తమకు హైదరాబాదులోని మాదాపూర్, హైటెక్ సిటీ వంటి ప్రాంతాల్లో తొమ్మిది బ్రాంచీలు ఉన్నాయన్నాడు. అపార్ట్‌మెంట్లను అద్దెకు తీసుకుని కో లివింగ్ గదులుగా మార్చుతున్నారు. తమ గదుల్లో అబ్బాయిలకు, అమ్మాయిలకు సపరేటుగా గదులు ఏర్పాటు చేశామన్నాడు. అంతేకాకుండా అబ్బాయిలకు, అమ్మాయిలకు విడివిడిగా ఫ్లోర్లు కూడా ఉన్నాయని చెప్పాడు. అయితే వివాహం కాకుండానే అమ్మాయిలు, అబ్బాయిలు ఒకే గదిలో కలిసుండటం వల్ల సమాజానికి జరుగుతున్న నష్టాన్ని యువత అంచనా వేయటం లేదని ఒక ఫ్యామిలీ అఫైర్స్ కౌన్సెలర్ వ్యాఖ్యానించారు. పెళ్లి, పిల్లల విషయంలో అమ్మాయిల్లో మారుతున్న ఆలోచనలకు కో లివింగ్ తాజా ఉదాహరణగా చెప్పారు.

• ఎడిటోరియల్

# ఉందిలే.. ఈఎంఐ ఊబి!

'ఉందిగా సెప్టెంబర్ మార్చిపైన.. వాయిదా పద్ధతుంది దేనికైనా'.. అని ఓ సినీ కవి చేసిన ఉవాచ ఇప్పుడు సగటు మనిషిపై తారకమంత్రంలా పని చేస్తోంది. ఆ పాటలోని మిగతా సాహిత్యాన్ని వదిలేసి 'వాయిదా పద్ధతుంది దేనికైనా' అన్న ఒకదాన్ని తెగ వాడేస్తున్నాడు. ముఖ్యంగా వస్తుసామగ్రి కొనుగోలు విషయంలో వాయిదాలనే నమ్ముకుంటున్నాడు. దాన్నే ప్రస్తుత మార్కెట్ పరిభాషలో చెప్పాలంటే ఈఎంఐ. ఇంటికి గానీ, తనకు గానీ ఏ అవసరం వచ్చినా.. 'ఉందిగా ఈఎంఐ సౌకర్యం' అని రాగం తీసుకుంటూ కొనిపడేస్తున్నాడు. మన దేశంలో మెజారిటీ జనాభాత మధ్యతరగతివారే. తమ కంటే పై స్థాయిలో జీవిస్తున్న వారిని అందుకోవటానికి చేసే ప్రయత్నం వారిని వాయిదాల పద్ధతిపై ఆధారపడేలా చేస్తోంది. ఈ క్రమంలో ఈఎంఐ పద్ధతిలో నెలనెలా చెల్లించవచ్చు కదా అన్న ధీమాతో కిందామీదా చూడకుండా కొనుగోళ్లు జరిపేస్తున్నారు. కానీ నెల తిరిగేసరికి ఈఎంఐల భారం కళ్లు తిరిగేలా చేస్తోంది. అర్థికంగా మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితి కల్పిస్తోంది. పరువు కోసం పాకులాడే మధ్యతరగతి ప్రజలు తమకు వస్తున్న ఆదాయాన్ని అవసరాలకు సరిపెట్టుకోవడంతో ఆగకుండా ఇతర కోరికలు, లగ్జరీలకు అప్పుల మీద అప్పులు చేసేస్తున్నారు. మధ్యతరగతి ప్రజలు పన్నులు, ద్రవ్యోల్బణం వంటి వాటి కంటే ఈఎంఐల భారంతో ఎక్కువ బాధపడుతున్నారని తాజా నివేదికలు చెబుతున్నాయి. కంటికి కనిపించని ఈఎంఐ ట్రాప్ భారతీయులను ఆర్థికంగా పతనబాట పట్టిస్తోంది. మధ్యతరగతి ప్రజలు 'సంపాదించటం.. అప్పులు చేయటం.. వాటిని చెల్లించటం.. ఆ గ్యాప్ పూడ్చటానికి మళ్లీ అప్పు చేయటం'.. ఇలా అప్పుల చట్రంలో చిక్కుకుంటున్నారు. ఎలాంటి సేవింగ్స్ లేకపోవటం, క్రెడిట్ కార్డులు స్వైప్ చేస్తూ తమకు తెలియకుండానే ఈఎంఐల ఉచ్చులో పడిపోయి వాటి నుంచి బయటకు రాలేకపోతున్నారు. ఫోన్ కొనాలన్నా, ఫ్రిజ్ కావాలన్నా, ఏసీ.. సోఫా.. విమానం, రైలు టికెట్లు.. చివరికి సినిమా టికెట్లకూ ఈఎంఐలు వాడేస్తున్నారు. కిరాణా సరుకులు కొనడానికి కూడా సూపర్ మార్కెట్లకు వెళ్లి క్రెడిట్ కార్డులు గీకేస్తున్నారు. ఎలాంటి పేపర్ వర్క్ లేకుండా రుణం అందుతుండటంతో చాలామంది రుణం తీసుకోవడం, ఈఎంఐ కట్టడాన్ని ఈ రోజుల్లో అతి సాధారణ అంశంగా భావిస్తున్నారు. కానీ పరిస్థితులు వాస్తవం కంటే దారుణంగా దిగజారుతున్నాయి. ఫలితంగా దేశంలో గృహ రుణాల వాట జీడీపీలో 42 శాతానికి చేరుకోవటం ఆందోళన కలిగిస్తోంది. ఎలాంటి సెక్యూరిటీ లేకుండా డెబిట్, క్రెడిట్ కార్డులపై అందే రుణాలు, 'బై నౌ పే లేటర్' వంటి సర్వీసులు పరిస్థితులను మరింతగా దిగజారుస్తున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే దేశంలో ప్రస్తుతం వినియోగంలో ఉన్న ఐఫోన్లలో 70శాతం ఈఎంఐలపై కొన్నవేనంటే అతిశయోక్తి కాదు. ఈఎంఐలకు ప్రజలు ఎంత అలవాటు పడిపోయారో దీన్ని బట్టే అర్థమవుతుంది. చిన్న రుణాలు తీసుకుంటున్న వారిలో 11 శాతం మంది ఈఎంఐలు కట్టడంలో విఫలమవుతున్నారని తేలింది. ఈ పరిస్థితుల్లో రుణాలను పేర్చుకొని పోతూ మధ్యతరగతి భారతీయులు కోలుకోలేని రుణాల ఊబిలోకి జారిపోతున్నారని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్రెడిట్ కార్డ్ బిల్లులు, ఫోన్ ఈఎంఐ, బైక్ ఈఎంఐ అంటూ ప్రతినెలా సంపాదనలో కనీసం రూ.25వేల వరకు చెల్లింపులకే కేటాయించాల్సి వస్తోంది. దీనివల్ల పొదుపు చేసే శక్తి సన్నగిల్లి ప్రతి అవసరానికి మళ్లీ అప్పులపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో అనుకోకుండా అనారోగ్యం ఏర్పడితే ఇక అంతే జీవితం మొత్తం తలకిందులైపోతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది వ్యక్తులకు సంబంధించిన సమస్య కాదని.. దేశాభివృద్ధిని కూడా దెబ్బతీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మధ్య తరగతివారే కాకుండా సంపన్నులు కూడా ఇటీవలి కాలంలో ఈఎంఐల వైపు మొగ్గు చూపుతున్నారు. తమకు వచ్చే ఆదాయంలో కట్టాల్సిన ఈఎంఐలు 40 శాతం లోపే ఉండేలా జాగ్రత్త పడాలని సూచిస్తున్నారు. అలాగే అత్యవసర సమయంలో ఆదుకునేలా ఎమర్జెన్సీ ఫండ్ ఏర్పాటుకు నెలకు కనీసం రూ.500 కేటాయించాలన్నారు. అందరి ముందూ గొప్పగా.. ఉన్నతంగా జీవిస్తున్నట్లు కనిపించటం కోసం రుణాలు తీసుకుని విలాసాలకు పోవద్దని హెచ్చరిస్తున్నారు. సరైన మార్గాల్లో పెట్టుబడులు పెట్టడం అలవర్చుకోవాలంటున్నారు. ఒత్తిడితో జీవితాన్ని గడపటం సాధారణమైన అంశం కాదని.. రుణాలు చెల్లించకుండా జీవించటం సక్సెస్ కాదంటున్నారు. ఎక్కువ సంపాదించటం కంటే ఎక్కువ దాచుకోవటంలోనే ఆర్థికంగా స్వేచ్ఛ లభిస్తుందని మధ్యతరగతి ప్రజలు గుర్తుంచుకోవాల్సి ఉంది.



స్వరాత్మక సంగీత విద్యాపీఠం, శ్రీకాకుళం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ తాళ్ళపాక అన్నమాచార్య సంకీర్తనా గాన యజ్ఞములో భాగంగా ఆదివారం పీఎన్‌కాలనీలో గల శ్రీ వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయములో గానం నిర్వహించారు. కార్యక్రమంలో గాయకుడు కేవీ ఉమామహేశ్వరరావు, ఆలయ ధర్మకర్త, రెడ్‌క్రాస్ చైర్మెన్ పి. జగన్మోహనరావు, పి.వి. ఆర్.ఎమ్. పట్నాయిక్, డాక్టర్ నిక్కు అప్పన్నలు పాల్గొన్నారు. **- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

## ఘనంగా తెరవే కవిసమ్మేళనం



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

నగరంలోని స్థానిక శాంతినికేతన్ కళాశాలలో తెలుగు రచయితల వేదిక 107 వ నెల నెలవారీ సాహితీ సమ్మేళనం సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకట రమణమూర్తిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 14మంది కవులు పాల్గొని స్నేహితుల దినోత్సవంపై తమ కవితలు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఐ.యన్.డి.ప్రసాద్, ఇద్దిపాపయ్య, ఎల్.సత్యానంద్, ముట్నూరు ఉపేంద్రశర్మ, పూడి జనార్దనరావు, నిక్కు అప్పన్న, మంగిపూడి శ్రీనివాసరావు, వావిలపల్లి రాజారావు, భోగెల ఉమామహేశ్వర రావు, బి.జగన్నాథరావు, సోడవరం ఈశ్వరరావు ఎస్.ఉమామహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## ఐఎంఎల్ డిపోను విడగొట్టొద్దు

**(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)**

రాష్ట్ర ప్రభుత్వం ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోని విడగొట్టొద్దని, కార్మికుల పొట్టలు కొట్టొద్దని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు కోరారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తమ పొట్టలు కొట్టొద్దు అంటూ ఒంటికాలిపై నిలుచొని నమస్కారం చేస్తూ సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎచ్చెర్లలో ఏపీఎస్.బీసీఎల్ (ఐఎంఎల్) డిపో హమాలీలు వినూత్నంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు కోసం ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని, కార్మికుల ఉపాధి కాపాడాలని డిమాండ్ చేశారు. టెక్కలి మండలం తిర్లంగి గ్రామంలో అదనంగా మరో మద్యం డిపో ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు వెంటనే రద్దు చేసి ఎచ్చెర్ల డిపోను యథావిధిగా కొనసాగించి దళితులు,పేదలుగా ఉన్న హమాలీల ఉపాధిని కాపాడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో హమాలీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.బంగారాజు, టి.రామారావు, ఎం.సురేష్, బోనెల రాము, లింగాల రాము, జి.గురుమూర్తి, పట్నాన రామారావు, ఎల్.సీతారాం, ముద్దాడ రాజు, కె.వి రమణ తదితరులు పాల్గొన్నారు.



## 41వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

వైకాపా ఆధ్వర్యంలో చేపడుతున్న బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం 41వ డివిజన్‌లో ఆ పార్టీ శ్రేణులు ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను వైకాపా నాయకుల ముందు ఏకరువు పెట్టారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు సాదు వైకుంఠరావు, ఎన్ని ధనుంజయ, పట్టణ బీసీ విభాగం అధ్యక్షులు గద్దిబోయిన కృష్ణారావు, తేజ, యడ్ల యాంకటి, నాగరాజు, సత్యనారాయణ, శాంతరావు కింజరాపు రమేష్, వానపల్లి రమేష్, బైరి మురళీ, హరి, జె.శ్రీనివాస్, చందు, కామేశ్వరి, రౌతు శంకరరావు, తోట తారక, తంగి అప్పన్న, రంగజీదేవ్, శాంతారావు, సీపాన మహేందర్, చామర్తి భాస్కర్, ఆలాపన త్రినాద్‌రెడ్డి, ఖాన్, సత్యనారాయణ, భానుప్రసాద్, సురేంద్ర, మెహర్ గాంధీ, రుప్ప శేషగిరి, అల్లబోయిన అప్పన్న, సిమల తారక, చక్రవర్తి, శ్రీను, పాపారావు, కన్నాబాబు తదితరులు పాల్గొన్నారు.

## సృష్టిలో తీయనిది స్నేహం మాత్రమే

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

స్నేహమేరా జీవితం... స్నేహమేరా శాశ్వతం..అంటూ ఓ సినీకవి అన్నట్లు స్నేహ బంధాల విలువలు తెలియజేసేందుకు స్టార్ వాకర్స్‌క్లబ్ సారధ్యంలో ఆదివారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బంధాలు, అనుబంధాలు, ఆప్యాయతలు, ఆత్మీయతలు, రక్త సంబంధీకులు దూరమవుతున్న ఈ యాంత్రిక జీవితంలో ఆపదలో ఉన్న వారిని అక్కున చేర్చుకొని అన్ని విధాలా ఆదుకొనే వారు నిజమైన స్నేహితులని స్టార్ వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉద్యాన శాఖ అధికారి రత్నాల వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టిలో తీయనిది అతి మధురమైనది స్నేహం మాత్రమేనని జీవితంలో మనిషి మరువలేనిది కష్టాల్లో సుఖాల్లో నిలిచి ఉండేది నిజమైన ప్రాణ స్నేహితులు మాత్రమేనన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో స్టార్ వాకర్స్ క్లబ్ సామాజిక సేవల్లో అగ్రభాగాన నిలుస్తుందన్నారు. స్నేహగీతం ద్వారా సామాజిక సేవలు మరింత రెట్టింపుగా చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆపదలో ఆదుకుంటూ, కష్టాల్లో పక్కనుంటూ అనునిత్యం ఎదుగుదలలో వుంటూ సొంత బంధువులు రక్త సంబంధీకులు చేయలేని పనులు స్నేహితులు మాత్రమే చేస్తారన్నారు. అంతకన్నా ముందు ఇటీవల న్యూఢిల్లీలో జాతీయ స్థాయిలో ఓడీఓపీ అవార్డ్ దక్కించుకున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి రత్నాల వరప్రసాద్‌ను వాకర్స్‌కు తీర్థయాత్రలు తీసికొని వెళ్ళి దిగ్విజయంగా తీసుకువచ్చిన రోషిని అనే యాత్రికురాలిని సత్కరించారు. స్టార్ వాకర్స్ క్లబ్ కో–ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో స్టార్ వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, పీజీ గుప్తా, గుడ్ల సత్యనారాయణ, స్టార్ వనితా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జి.లక్ష్మీ స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు సుగంధం సంజీవరావు, డాక్టర్ జీవన్ రావు, అంకాడాల తవిటన్న, గుడ్ల గోపాలరావు, మెట్ట దనుంజయ భట్లు, పట్నాల రామకృష్ణ, దువ్వు కృష్ణారావు, నల్లబాటి కృష్ణమూర్తి, నందిగామ గీతా కామేశ్వరరావు, పాలిన ప్రసాద్, సింగూరు టాగూర్, డీఈ గనిరాజు తదితరులు పాల్గొన్నారు.



# 'కాంతార 3'లో ఎన్టీఆర్





కాంతార.. కన్నడ చిత్రసీమ గర్వంగా చెప్పుకొనే పేరు. రిషబ్ శెట్టికి ఈ సినిమాతో జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఇప్పుడు కాంతార 2తో బిజీగా ఉన్నారాయన. ఈ సినిమా త్వరలోనే రాబోతోంది. కాంతార 3కి కూడా పార్ట్ 2లోనే లీడ్ ఇవ్వబోతున్నట్టు సమాచారం. కాంతార 3 ఇంకా భారీగా రూపొందించాలన్నది రిషబ్ ప్లాన్. అందులో భాగంగా మరో స్టార్ హీరోని ఈప్రాజెక్ట్ లోకి తీసుకొచ్చే ప్రయత్నాలు గట్టిగా జరుగుతున్నాయి. ఆ స్టార్ హీరో తెలుగు నుంచే ఉంటారని, ఆ అవకాశాలు ఎన్టీఆర్‌కి ఎక్కువ ఉన్నాయని ఇన్‌సైడ్ వర్గాలు చెబుతున్నాయి. ఆమధ్య ఎన్టీఆర్– రిషబ్‌శెట్టి ఇద్దరూ కలిశారు కూడా. ఆ సమయంలోనే కాంతార–3కి సంబంధించిన చర్చలు జరిగినట్టు తెలుస్తోంది. కాంతార–2లోనే ఎన్టీఆర్‌కి సంబంధించిన లీడ్ కూడా ఉండొచ్చు. కాకపోతే పార్ట్ 3.. ఇప్పట్లో ఉండదు. కాస్త సమయం పడుతుంది. ఈ గ్యాప్‌లో రిషబ్ ఓ సినిమా పూర్తి చేస్తారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో ఈ చిత్రం రూపుదిద్దుకొంటుంది. అశ్విన్ గంగరాజు దర్శకత్వం వహిస్తారు. ఆ తరవాతే కాంతార–3 ఉంటుంది. నిజంగానే ఈ ఊహాగానాలు నిజమై ఎన్టీఆర్, రిషబ్ శెట్టి ఓ సినిమాలో కనిపిస్తే బాక్సాఫీసుపై దద్దరిల్లడం ఖాయం.

**- తెలుగు 360.కామ్ సౌజన్యంతో..**




### వార్-2 x కూలీ..

# హైప్ ఎలా ఉందంటే?

ఆగస్టు 14వ తేదీ ఇండియన్ బాక్సాఫీస్ వద్ద భారీ క్లాష్ జరగనున్న విషయం తెలిసిందే. రెండు హై వోల్టేజ్ సినిమాలు ఆ రోజు థియేటర్స్‌లో రిలీజ్ కానున్నాయి. వార్–2, కూలీ చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. రెండు సినిమాలపై ఆడియన్స్‌లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. రిలీజ్ కు ఇంకా పది రోజులు మాత్రమే మిగిలి ఉంది. కోలీవుడ్ సూపర్ స్టార్ రజనీ కాంత్ లీడ్ రోల్‌లో నటించిన సినిమా కూలీ. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించిన ఆ మూవీ మాస్ మసాలా ఎంటర్టైనర్‌గా రూపొందుతోంది. టాలీవుడ్ కింగ్ నాగార్జున, బాలీవుడ్ స్టార్ హీరో అమీర్ ఖాన్ సహా శ్రుతి హాసన్, సాబిన్ సాహిర్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. కళానిధి మారన్.. భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు.

రీసెంట్‌గా మేకర్స్.. ట్రైలర్ రిలీజ్ చేయగా అది ఆడియన్స్ ను విపరీతంగా మెప్పించింది. సినీ ప్రియులను అంచనాలను ఆకాశాన్ని తాకేలా చేసింది. యాక్షన్ ప్యాక్డ్‌గా ఉన్న ట్రైలర్‌ను.. సరైన రీతిలో మేకర్స్ కట్ చేశారనే చెప్పాలి. ఆ తర్వాత ఉన్న హైప్ ను భారీ పెంచారు. దీంతో సినిమా సాలిడ్ ఓపెనింగ్స్ ను సాధించడం పక్కా అని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. ఆ తర్వాత వార్–2 ట్రైలర్ కూడా ఇప్పటికే రిలీజ్ అయింది. కానీ మోస్తరు స్పందన మాత్రమే వచ్చింది. ఇంతకు ముందు వచ్చిన టీజర్ విషయంలో కూడా అదే జరిగింది. దీంతో మేకర్స్ అనుకున్న స్థాయిలో అంచనాలు క్రియేట్ చేయలేదు. ఇప్పుడు భారీ ప్రమోషనల్ ప్రచారంతోపాటు విడుదలకు ముందు ఒక మంచి గ్లింప్స్ అవసరమనే చెప్పాలి. అయితే ఎన్టీఆర్, హృతిక్ రోషన్ వంటి స్టార్ హీరోలు ఉండటం ఓపెనింగ్స్ భారీగా ఉండనున్నట్లు తెలుస్తోంది. కానీ ప్రమోషన్స్ లో మాత్రం స్పీడ్ పెంచి అంచనాలు క్రియేట్ చేయాల్సిందే. అదే సమయంలో ఓవర్సీస్ లో కూలీ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ ఇప్పటికే స్టార్ట్ అయ్యాయి. అప్పుడే మిలియన్ డాలర్ మార్క్ కు దగ్గరగా వెళ్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. కానీ వార్–2 ఇంకా ఊపందుకోలేదు. సినిమాకు తగిన సంఖ్యలో స్క్రీన్లు వచ్చేలా పంపిణీదారుల భారీ ఎత్తుగడలు అవసరం. ముందస్తు అమ్మకాలు బాగానే ఉన్నప్పటికీ.. ఇంకా హైప్ క్రియేట్ చేసిన వాటిని పెంచాలి. దీంతో కూలీ మూవీ వార్–2 కన్నా అన్ని విషయాల్లో ముందు ఉంది. దానితో ఈక్వల్ గా ఉండాలంటే వార్–2 మేకర్స్ ఏం చేస్తారో వేచి చూడాలి.

**- తుపాకి.కామ్ సౌజన్యంతో...**

# మాస్ జాతర.. డౌట్ వద్దు!!

రవితేజ మాస్‌జాతర పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నాగవంశీ నిర్మిస్తున్న సినిమా ఇది. డైలాగ్ రైటర్‌గా పేరు తెచ్చుకున్న భాను ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం కానున్నాడు. ఆగస్టు 27న ఈ సినిమా రిలీజ్ డేట్ ఇచ్చారు. కానీ ఆ సమయానికి వస్తుందా లేదా అనే చిన్న అనుమానం. ఎందుకంటే ప్రస్తుతం కింగ్డమ్‌తోనే ఇంకా బిజీగా ఉన్నారు వంశీ. దీని తర్వాత వార్ 2 ప్రమోషన్స్ మొదలుపెట్టాలి. మాస్ జాతర పనులు ఎంతవరకు వచ్చాయో ఇంకా ఓ అంచనాకు రాలేదు. పైగా 27 అంటే ఈపాటికి ప్రమోషన్స్ మొదలుపెట్టాలి. అందుకే.. మాస్ జాతర రిలీజ్‌పై చిన్న డౌట్. అయితే ఇప్పుడా అనుమానం అవసరం లేదు.



ఈ సినిమా ప్రమోషన్స్‌కి శ్రీకారం చుడుతూ 'ఓలే ఓలే' అంటూ సాగే పాటను సోమవారం విడుదల చేయనున్నారు. అంతేకా దు, ఈ సినిమా రిలీజ్ డేట్ మళ్లీ క్లారిటీ ఇచ్చారు. 'ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 27న విడుదల' అని అనౌన్స్ చేశారు. దీంతో ఈ మూవీ వినాయక చవితి కానుకగా రావడం ఖాయమైంది. రవితేజ కెరీర్‌లో 75వ సినిమా ఇది. ధమకా తర్వాత మళ్లీ విజయాన్ని అందుకోలేకపోయిన రవితేజకి మాస్ జాతర విజయం చాలా కీలకం.

**- తెలుగు 360.కామ్ సౌజన్యంతో..**



## రెడ్డిక స్థూపం నిర్మాణానికి శంకుస్థాపన



**(సత్యంన్యూస్, ఇచ్ఛాపురం)**

రెడ్డికలు ఐక్యతను చాటిచెప్పేలా కొత్త కొజ్జిరియా రెడ్డికుల సంఘ భవన ప్రాంగణంలో స్టాట్యూ ఆఫ్ రెడ్డీకాస్ యూనిటీ స్థూపాన్ని నిర్మించేందుకు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఇచ్ఛాపురం జోన్ (పూరి, గంజాం, శ్రీకాకుళం రెడ్డిక మహాజన పురోభివృద్ధి సంఘం) ఆధ్వర్యంలో జోన్‌రెడ్డికుల సంఘ పెద్దలందరూ హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రెడ్డికసంఘ పెద్దలు మాట్లాడుతూ వందేళ్ల సంఘ ఖ్యాతిని భావితరాలకు అందించేందుకు ఈ స్థూపం దోహద పడుతుందన్నారు. స్థూపం నిర్మాణం 100 రోజుల్లో పూర్తి చేసుకుని వందేళ్ళ వేడుకలు నిర్వహణకు తీర్మానించారు.

## 'హర్షవల్లి లయన్స్'కు అవార్డుల వర్షం

**- 316ఎ లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ క్విజ్ చైర్మన్‌గా లయన్ వావిలపల్లి జగన్నాథం నాయుడు**




**(సత్యంన్యూస్, విశాఖపట్నం)**

విశాఖపట్నంలోని ఒక ప్రైవేట్ హాల్‌లో 316ఏ లయన్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ పదవీ ప్రమాణస్వీకారం, అవార్డుల ప్రధానోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించినందుకు గాను హర్షవల్లి లయన్స్ క్లబ్‌కు మూడు ప్రత్యేక అవార్డులను అందజేశారు. ఒకే క్లబ్ నుండి నలుగురు సభ్యులకు లయన్స్ ఇంటర్నేషనల్ కేబినెట్‌లో పదవుల్ని కేటాయించటం విశేషం. లయన్ డాక్టర్ చింతాడ కృష్ణమోహన్ రీజియన్ చైర్మన్‌గా, లయన్ వావిలపల్లి జగన్నాథం నాయుడు క్విజ్ కాంపిటీషన్స్ జిల్లా చైర్మన్‌గా, కరణం శోభారాణి పార్కుల అభివృద్ధి జిల్లా చైర్మన్‌గా, లయన్ కెఎన్‌ఎస్‌వి ప్రసాద్ (హారికా ప్రసాద్) అడాప్షన్ జిల్లా చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా హర్షవల్లి లయన్స్‌ను పలువురు ప్రశంసించారు. అలాగే క్యాబినెట్ మెంబర్లుగా నియమితులైన నలుగురికి అభినందనలు తెలిపారు.

## ఆదిత్యుని ఆదాయం రూ.రూ.4.75 లక్షలు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కేశఖండన శాలలో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 10 గంటల వరకు ఉచిత, రూ. 100, రూ. 300 దర్శనం క్యూలైన్లు కిటకిటలాడాయి. ఆర్జిత సేవలు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 4.75 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈవో కె.ఎన్.వి.డి.వి. ప్రసాద్ తెలిపారు. ఇందులో టికెట్లు రూపేనా రూ. 2,04,100, పూజలు, విరాళాల రూపంలో రూ. 86,651, ప్రసాదాల రూపంలో రూ. 1,84,585 ఆదాయం సమకూరినట్లు ఈవో తెలిపారు.

## సహకార వ్యవస్థ మరింత శక్తివంతం చేస్తాం

**(సత్యంన్యూస్, అమరావతి/శ్రీకాకుళం)**

సహకార వ్యవస్థను మరింత శక్తివంతం చేసి, ప్రతి రైతు కుటుంబాన్ని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ (ఏపీసీవోబీ) 62వ స్థాపన దినోత్సవం సందర్భంగా బ్యాంక్ ద్వారా ప్రయోజనం పొందుతున్న రైతులకు, మహిళా సమాఖ్యలకు, యువతకు, సహకార సంఘాల సభ్యులకు, అధికారులు, సిబ్బందికి ఆయన ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని సహకార రంగాన్ని బలోపేతం చేస్తూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు నాడి వంటి సేవలను ఏపీసీవోబీ అందిస్తోందన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు, పెట్టుబడులకు సకాలంలో రుణాలు అందిస్తూ, వ్యవసాయ అభివృద్ధికి దోహదపడుతోందని, సహకార వ్యవస్థను మరింత శక్తివంతం చేసి, ప్రతి రైతు కుటుంబాన్ని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడమే లక్ష్యమన్నారు.



## ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ఐక్య ఉద్యమాలకు సిద్ధంకావాలి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ**

**(సత్యంన్యూస్, విజయవాడ)**

రాష్ట్రంలోని ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. విజయవాడలో ఆర్‌టిసి పాత బస్టాండ్‌ను లులూ సంస్థకు అప్పగించడాన్ని నిరసిస్తూ ఈ నెల 6న పౌరవేదిక ఆధ్వర్యంలో జరుగనున్న మహాధర్నాకు మద్దతు ప్రకటించారు. విజయవాడ నగరంలో ఆర్టీసి పాతబస్టాండ్ స్థలాన్ని లులూ గ్రూపునకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జివోను వ్యతిరేకిస్తూ సీపీఐ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో విజయవాడ దాసరి భవన్‌లో జి.కోటేశ్వర రావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడుతూ విజయవాడలో అత్యంత చారిత్రక నేపథ్యం కలిగి, అతి విలువైన పాతబస్టాండ్ స్థలాన్ని బహుళజాతి సంస్థ లూలూ గ్రూపునకు అప్పగించాలనుకోవడం తగదన్నారు. ప్రజావసరాలకు వినియోగించాల్సిన ప్రభుత్వ భూములను ప్రైవేటుకు కట్టబెట్టడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. నగర మాజీ మేయర్ జంధ్యాల శంకర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పులను ఉల్లంఘిస్తూ పాలకులు ప్రైవేటు సంస్థలను ప్రోత్సాహకాల పేరుతో భూసంతర్పణ చేయడాన్ని ఆక్షేపించారు. వైకాపా నాయకులు మల్లాది విష్ణు, సీపీఎం రాష్ట్ర నాయకులు దోనేపూడి కాశీనాథ్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహరావులు మాట్లాడుతూ లులూ వంటి వ్యాపార సంస్థలు నగరంలో ప్రవేశంతో చిన్న, మధ్యతరహా వ్యాపారులు మూతపడే ప్రమాదముందని, ప్రజలు ఉపాధి కోల్పోయే అవకాశం ఉందన్నారు. సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు పి.ప్రసాద్, సిపిఐ (ఎం.ఎల్) లిబరేషన్ నాయకులు హరనాథ్, ఎస్సీసిఐ నాయకులు సుధీర్ బాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివి నరసయ్య, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎండి ప్రసాద్, జోనల్ కార్యదర్శి వైఎస్ రావు, ఎఐటియుసి నగర అధ్యక్షులు కె.ఆర్.అంజనేయులు తదితరులు ఆయా స్థలాన్ని ఆర్టీసీ పురోగతికి వినియోగించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్క వీరభద్రరావు, కెవి భాస్కర రావు, తాడి పైడయ్య, కొట్టు రమణారావు, మహిళా సమాఖ్య నగర అధ్యక్ష కార్యదర్శులు ఓర్సు భారతి, పంచదార్ల దుర్గాంబ, ఎఐటియుసి నగర కార్యదర్శి మూలి సాంబ శివరావు తదితరులు పాల్గొన్నారు.



### స్థలం కేటాయింపు అడ్డుకుంటాం

**- ఈయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు -**

రూ.400 కోట్లు విలువచేసే గవర్నర్‌పేట డిపో, పాత బస్టాండుకు చెందిన ఆర్టీసి స్థలాన్ని లులూ మాల్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాటాలు చేసి, అడ్డుకుంటామని ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి.వీ.నరసయ్య అన్నారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల ఉద్యోగులతో ఈ నెల 5,9,13,17 తేదీల్లో ఆరు జిల్లాల చొప్పున సమావేశాలతో పాటు లులూ మాల్‌కు ఆర్టీసి స్థలాన్ని కేటాయిస్తూ ఇచ్చిన జీవో రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ముఖ్య నాయకులతో సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు.

## తండ్రి జ్ఞాపకార్థం స్మశానవాటిక అభివృద్ధి



**(సత్యంన్యూస్, లావేరు)**

తండ్రి జ్ఞాపకార్థం మురపాక స్మశాన వాటికకు సొంత నిధులతో అతని కుమారులు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. మురపాక గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు దివంగత తేనెల మంగయ్యనాయుడు జ్ఞాపకార్థం అతని భార్య తేనెల వెంకట రమణమ్మ, కుమారులు సురేష్‌కుమార్ (మురపాక ఎంపీటీసీ) సత్యమూర్తి (వైజాగ్ కమ్యూనికేషన్స్ సీఐ), విద్యాసాగర్ (రణస్థలం ఆర్‌డబ్ల్యూఎస్) మురపాక స్మశానవాటికకు ప్రధాన ఆర్చి నిర్మించి, ముందువైపు మొక్కలు, ముల్లు కంచె తొలగించడంతో పాటు వీరబాహుడు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకు రూ. 2.50 లక్షలు సొంత నిధులు ఖర్చు చేశారు. భవిష్యత్తులో ప్రభుత్వ సహకారంతో స్మశాన వాటికని ఎత్తు చేసి అభివృద్ధి చేస్తామని వారు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మురపాక గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులతో పాటు పలు పార్టీల నాయకులు, యువత పాల్గొన్నారు.



# ఆ ఊరు సివిల్ సర్వెంట్స్ ఫ్యాక్టరీ!



విద్యా నామ నరస్య రూపమధికం ప్రచ్ఛన్నగుప్తం ధనం.. విద్యా భోగకరీ యశస్సుఖకరీ విద్యా గురూణాం గురుః.. విద్యా బంధుజనో విదేశగమనే విద్యా పరం దైవతం.. విద్యా రాజసు పూజ్యతే న తు ధనం విద్యావిహీనః పశుః.. ఇది భర్తృహరి సుభాషితం.

విద్య మనిషికి అందమైన రూపం. దాచి ఉంచిన గొప్ప ధనం. విద్య వల్ల భోగాలు, కీర్తి, సుఖం లభిస్తాయి. విద్య గురువులకు గురువు. విదేశాలకు వెళ్లినప్పుడు బంధువులా సహాయపడుతుంది. విద్య గొప్ప దైవం. రాజులు కూడా ధనం కంటే విద్యనే పూజిస్తారు. విద్య లేనివాడు పశువుతో సమానం అని భావం. అలాంటి విద్య విలువ తెలుసుకున్న గ్రామమది. అందుకే, ఆ గ్రామమిప్పుడు సివిల్ సర్వెంట్స్‌కు ఓ పరిశ్రమ!



ఉత్తరప్రదేశ్ జాన్‌పూర్ జిల్లాలోని మాధోపట్టి గ్రామం గురించి చదువు మీద ఆసక్తి ఉన్న ప్రతీ ఒక్కరూ తెలుసుకుని తీరాలి. అదో చిన్న గ్రామం. కేవలం 75 కుటుంబాలుండే ఊరు. వారికక్కడ ఎలాంటి కోచింగ్ ఇనిస్టిట్యూట్స్ లేవు. మెట్రోపాలిటియన్ నగరాల్లో చదువుకోవడానికి కనిపించే వసతులు, సౌకర్యాలు అస్సలే కానరావు. కానీ, ఆ ఊరు సివిల్ సర్వెంట్స్‌తో ఇప్పుడు ఒక ప్రభంజనంలా నిలుస్తోంది.

**జస్ట్ 75 కుటుంబాలున్న ఓ ఊరు.. ఇప్పుడు ఏకంగా 50 మందికి పైగా ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్‌ఎస్ ఉద్యోగస్థులను తయారుచేసే వాతావరణంతో అందరి దృష్టినీ తనవైపు తిప్పుకుంటోంది. కేవలం ఐఏఎస్ సాధించినవారి సంఖ్యే ఇప్పుడిక్కడ 47 మంది అంటే నమ్మగలరా..?**

సాధారణంగా ఏ ఊరువారైనా బాగా తెలివి తేటలున్నవారు అధిక సంఖ్యలో కనిపిస్తే.. ఆ ఊరు నీళ్లల్లోనే ఏదో మహత్యముందనుకుంటూ ఉంటాంగా! అదిగో అలా అక్కడి సివిల్ సర్వెంట్స్‌లో చాలామంది కూడా మొదటి ప్రయత్నంలోనే తమ లక్ష్యాలను సాధించి తమ గ్రామానికి అలాంటి విశేషమైన పేరు సంపాదించిపెట్టారు. అందుకే ఇప్పుడు మాధోపట్టి.. భారత్ సివిల్ సర్వీసెస్ ఫ్యాక్టరీగా ఖ్యాతికెక్కింది. అందుకు, అక్కడి సమాజం నుంచి లభించే మద్దతు కూడా వారిని సానుకూల దృక్పథంలో నడిపిస్తోంది.

### ఆ ఊరు రాణించడం వెనుక వందేళ్ల చరిత్ర!

స్వాతంత్ర్య సమరయోధుడు ఠాకూర్ భగవతి దిన్ సింగ్, ఆయన భార్య శ్యామ్రాతి సింగ్ మొదట్లో పిల్లలకు విద్యనందించడంతో ఆ ఊరు బీజాక్షరాలను దిద్దడం ప్రారంభించింది. 1917లో ఆ ప్రయాణం ప్రారంభమైంది. అలా ప్రారంభంలోనే అబ్బాయిలతో పాటు.. బాలికలకూ విద్యనందించాలని శ్యామ్రాతి తీసుకున్న నాటి విప్లవాత్మక నిర్ణయంతో మొదలైన లెగసీ.. ఇవాళ విద్యా పరివర్తనలో ఆ ఊరు వృద్ధి చెందిన తీరుకు ఓ ప్రేరణగా నిల్చింది. ఆ తర్వాత బ్రిటీషర్స్ కాలంలోనే ఈ ఊరుకు చెందిన ముస్తఫా హుస్సేన్ ఇండియన్ సివిల్ సర్వీసెస్‌కు ఎంపికై.. ఆ తర్వాత తరాల నుంచి ఇప్పటితరం వరకూ కూడా స్ఫూర్తినిస్తున్నాడు. అయితే, ఆ తర్వాత మళ్లీ సివిల్స్‌లో ఆ గ్రామవాసులు పెద్దగా ఎవ్వరూ లక్ష్యాలను సాధించలేకపోయారు. అలా 40 ఏళ్లు గడిచాక ప్రకాష్‌సింగ్ అనే మరో వ్యక్తి సివిల్స్‌లో దేశంలోనే రెండో ర్యాంక్ సాధించి.. మళ్లీ మాధోపట్టిలో సివిల్స్ వైపు యువత చూపును తిప్పి.. తమ గ్రామాన్ని మేథోపట్టిగా మార్చాడు.

### రహస్యమేంటి..?

చదువులంటే పట్టణాల్లో, నగరాల్లో కోచింగ్ సెంటర్స్‌లో విచ్చలవిడిగా డబ్బులు కట్టి పేరెంట్స్ పిల్లలను అప్పగించిరావడం, అక్కడ వారు బాయిలర్ కోళ్లలా మగ్గుతూ చదవడం కాదని.. సమష్టి మార్గదర్శకత్వంతో ఎదగడమని నిరూపించింది మాధోపట్టి. సివిల్ సర్వీసెస్ సాధించినవారు ఉద్యోగాలు రాగానే.. రెక్కలు గట్టుకుని మూలాలు మరిచి ఎగిరిపోరు. మధ్య మధ్యన ఊరికి వచ్చి సెమినార్స్‌లో పాల్గొంటారు. ఔత్సాహితులైన ఆశావహులకు పాఠాలు బోధిస్తారు. మార్గనిర్దేశనం చేస్తారు. ఒకింట్లో ఎవరైనా సివిల్ సర్వెంటైతే.. ఆ ఊరంతా కలిసి వేడుక జరుపుకునే ఐక్యత అక్కడి ప్రత్యేకత. షేరింగ్ ఈజ్ కేరింగ్ అన్నట్టుగా జ్ఞానాన్ని పంచుకునే ఒక సంస్కృతితో మాధోపట్టి యావత్ దేశం మొత్తం చూపునూ తనవైపు తిప్పుకుంది

ఆ ఊరికి చెందిన ఓ సింగ్ నలుగురు సోదరులూ ఐఏఎస్‌లు. వినయ్, ఛత్రపాల్, అజయ్, శశికాంత్. ఆ నలుగురి విజయాన్ని ఊరు ఊరంతా కలిసి జరుపుకుంది. ఇప్పుడక్కడి ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్‌తో పాటు.. ఇతర గ్రూప్ ఎగ్జామ్స్‌లో విజయాలు సాధించినవారు.. భిన్నరంగాల్లో దేశం మొత్తం విస్తరించి మాధోపట్టి పేరును నిలబెట్టారు. అంతరిక్ష పరిశోధన, న్యాయవ్యవస్థ, బ్యాంకింగ్ సెక్టార్, అణుశాస్త్రవేత్తలు ఇలా ఈ ఊరంటేనే విద్యావేత్తల నిలయం. ఏ ఒక్కరిని కదిపినా.. వారొక లైబ్రరీలా కనిపిస్తారు. ఇలా జాతీయస్థాయిలో మాధోపట్టి సివిల్ సర్వెంట్లకు ఓ చిరునామాగా



మారింది.

మొదటే భర్తృహరి సుభాషితాల్లో చెప్పినట్టుగా ఒక సమాజం విద్యను ఆదరిస్తే.. గౌరవిస్తే.. దాని విలువ తెలుసుకుంటే.. సరిగ్గా అంచనా వేయగలిగితే ఏం జరుగుతుందో చెప్పడానికి మాధోపట్టి ఓ నిలువెత్తు ఉదాహరణ.

చదువంటే డబ్బు.. బడా ప్రైవేట్, కార్పోరేట్ స్కూల్స్, కాలేజెస్ మాత్రమే అని భావిస్తున్న రోజుల్లో ఆశయం, అందుకు తగ్గ కృషి, సాయమందించి, ప్రోత్సహించే సమాజముంటే ఎలా ఎదుగవచ్చో మాధోపట్టి మిగిలిన సమాజానికి చూపిస్తోంది.

**- బాతాఖానీ సౌజన్యంతో..**



ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666

# కూటమి పాలనలో రైతులకు అష్టకష్టాలు

- ఎరువులు బ్లాక్‌మార్కెట్‌కు తరలిపోతున్నాయి
- డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతున్నారు
- గ్రీవెన్స్‌లో వైకాపా నాయకులు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

టీడీపీ నేతృత్వంలోని కూటమి పాలనలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని వైకాపా నాయకులు ఆరోపించారు. సోమవారం జెడ్పీ గ్రీవెన్స్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కారించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను వైకాపా ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా పరిశీలకులు కుంభా రవిబాబు, పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, పార్టీ నాయకులు రెడ్డి శాంతి, పేరాడ తిలక్, గొర్లె కిరణ్, చింతాడ రవికుమార్, గేదెల పురుషోత్తం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ కూటమి సర్కార్ సూపర్ సిక్స్ హామీలను నిలబెట్టుకోపోగా రైతులను మరిన్ని కష్టాలకు గురిచేస్తోందని విమర్శించారు. అన్నదాత సుఖీభవలో కోత విధించి కొందరికే వర్తింపజేశారని ఆరోపించారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక పంటలను రోడ్డుమీద వేయాల్సిన పరిస్థితికి దిగజార్చారని విమర్శించారు. ఉచిత పంటల బీమాను రద్దు చేసి రైతులకు నడ్డి విరిచారని ఆరోపించారు. రైతులకు సున్నావడ్డీ పథకాన్ని కూడా ఎతేశారని, రైతులకు అందాల్సి విత్తనాలు, ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలించి, రైతు సేవా కేంద్రాలను పూర్తిగా నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. ఎరువులను పంపిణీ చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఎరువుల కోసం మళ్లీ రైతులు క్యూలో నిలబడాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల ఎరువుల ధరలు అమాంతం పెరిగిపోయాయని, అన్నదాతలు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి, ప్రైవేటు వ్యాపారస్తుల వద్ద ఎరువులు కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, ప్రజల సమస్యలను పక్కదారి పట్టించేలా కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడి డైవర్షన్ రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. రైతుల సమస్యల పట్ల ప్రభుత్వం ఉదాసీనతతో వ్యవహరిస్తోందని విమర్శించారు. రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచి యూరియా కొరతను వెంటనే నివారించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించి, రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులందరికీ ఎరువులు పంపిణీ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతూ వైకాపా నాయకులపై అక్రమ కేసులు పెడుతుందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కరిమి రాజేశ్వరరావు, కే.వీ. సత్యనారాయణ, గొండు రఘురాం, రౌతు శంకరరావు, కణితి కృష్ణారావు, కనపల శేఖర్, అరవింద్ రైతు విభాగం నాయకులు పాల్గొన్నారు.

## కిడ్నీ బాధితులకు న్యాయం చేయండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పొందూరు మండలం కృష్ణాపురం గ్రామంలో కిడ్నీ వ్యాధి కారణంగా 19 మంది మరణించారని, మరో 22మంది చికిత్స పొందుతున్నారని, దీనిపై తక్షణమే విచారణ జరిపించాలని వైకాపా ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవి కుమార్ కోరారు. ఈమేరకు సోమవారం గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు. అలాగే ఆమదాలవలస మండలం తోటవాడ పంచాయతీలో బావాజీమఠం భూములు అన్యాక్రాంతంపై ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన వితంతు పింఛన్లు బయోమెట్రిక్స్ తీసుకొని అమౌంట్ ఇవ్వడంలేదని, బూర్జ మండలం ఉవ్వపేట గ్రామంలో రాజకీయ కారణాలతో పెన్షన్ నిలుపుదల చేసిన వ్యక్తికి తిరిగి మంజూరు చేయాలని కోరారు.

# కూటమిగా గెలిచారు.. పార్టీగా ఓడారు!

(మొదటిపేజీ తరువాయి)

ఆలయానికి చేరుకోవడంతో నగర కేడర్ దూరంగా నిలబడిపోయారు. లక్ష్మీదేవితోపాటు హోంమంత్రి కార్యక్రమంలో పాల్గొంటే ఆమెతో కలిసి రాజకీయాలు చేస్తున్నారనే సంకేతాలు వెళ్తాయన్న కోణంలో వీరంతా వెనుదిరిగారు. దీంతో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండ లక్ష్మీదేవేమోనన్న సందేహాలు వచ్చాయి. ఎన్నికల సమయంలో శంకర్ అభ్యర్థిత్వాన్ని ఏ మాత్రం అంగీకరించని గుండ దంపతులు ఆ కొద్ది నెలలు విశాఖపట్నానికి మకాం మార్చారు. అప్పల సూర్యనారాయణ అయితే తాను గత ఎన్నికల్లో ఓటే వేయలేదని ప్రకటించారు. లక్ష్మీదేవి పోలింగ్ రోజున కొద్దిమంది వైకాపా కోసం పనిచేసే యువకులతో కలిసి తీయించుకున్న ఫొటో బయటకు వచ్చింది. దీంతో గత ఎన్నికల్లో గుండ దంపతులు శంకర్ కోసం పని చేయలేదని పార్టీకి నివేదికలు వెళ్లాయి. ఆ తర్వాత కొన్నాళ్ల పాటు స్తబ్దుగా ఉన్న లక్ష్మీదేవి ఈమధ్య కాలంలో సిటింగ్ ఎమ్మెల్యేకు తలనొప్పి కలిగించే విధంగా పర్యటనలు, పరామర్శలు చేస్తున్నారు. ఇది పార్టీ ద్వితీయశ్రేణి నాయకత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. శంకర్ అభ్యర్థిత్వాన్ని ఏ మాత్రం అంగీకరించని లక్ష్మీదేవి కుటుంబం ఇప్పుడు పార్టీ నాయకుల ఇళ్లకు వెళ్తుండటంతో ఏంచేయాలో కేడర్‌కు పాలుపోవడంలేదు.

### మాజీ హోదాతో పోటీ పర్యటనలు

ఒక్క ముక్కలో చెప్పాలంటే తమతో ఉంటూనే గొండు శంకర్ పార్టీ టిక్కెట్ ఎలా తెచ్చుకున్నారో, ఇప్పుడు కూడా లక్ష్మీదేవి పార్టీలో ఉంటూనే వచ్చే ఎన్నికలకు శంకర్‌ను తప్పించే యోచనలో పని చేస్తున్నారనేది కార్యకర్తల భావన. అందుకే ఆమె వెళ్లే కార్యక్రమాలకు కేడర్ దూరం జరుగుతోంది. 2024 ఎన్నికలకు ముందు నగరంలో గొండు శంకర్ పర్యటిస్తున్న సందర్భంలో రెల్లివీధి వద్ద నగర పార్టీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ అడ్డుకున్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా లక్ష్మీదేవి ఉన్నప్పుడు ఏ హోదాలో నగరంలో పర్యటిస్తున్నారంటూ కొంతమంది కేడర్‌తో కలిసి నిలదీశారు. ఆ తర్వాత శంకర్‌కే టిక్కెట్ దక్కడంతో పార్టీలో అధిక శాతం మంది ఆయన కోసం పని చేశారు. ఇప్పుడు లక్ష్మీదేవి అటువంటి ప్రశ్న ఉత్పన్నం కాకుండా పార్టీ తరపున కాకుండా మాజీ ఎమ్మెల్యే హోదాలో పరామర్శలు చేపడుతున్నారు. దీనివల్ల కేడర్ అడ్డుకోలేకపోతోంది సరికదా.. ఆమెతో కలిసి ఫొటోలో కనిపిస్తే తమ రాజకీయ జీవితానికి నూకలు చెల్లిపోతాయన్న భావనలో ఉన్నారు. గత ఎన్నికల్లో గుండ దంపతులు చంద్రబాబు నిర్దేశించిన అభ్యర్థికి మద్దతు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేదికాదు. అలా కాకుండా శంకర్‌కు టికెట్ ప్రకటించిన 20 రోజుల వరకు ఒక రకమైన సందిగ్ధావస్థను సృష్టించి చంద్రబాబు ఇచ్చిన ఏ ఆఫర్‌నూ అంగీకరించకుండా ఏకపక్షంగా వ్యవహరించిన ఫలితమే ఇది. ఒక్క ముక్కలో చెప్పాలంటే గుండ కుటుంబం తమ రాజకీయ జీవితాన్ని తామే చెడగొట్టుకున్నారు. శ్రీకాకుళంలో ధర్మాన ప్రసాదరావు మీద గెలవడం గుండ కుటుంబం తప్ప మరొకరికి సాధ్యం కాదన్న రీతిలో ప్రచారం ఉండేది. శంకర్ కేవలం సర్పంచ్ మాత్రమేనని ఆయనకు ఆ స్థాయి లేదని పోలింగ్ రోజు వరకు ఒక ట్రోలింగ్ నడిచింది. కానీ భారీ మెజార్టీతో శంకర్ గెలిచారు. దీంతో టీడీపీ తరఫున ఎవరు నిల్చున్నా గెలుస్తారని, విజయం గుండ కుటుంబం సొత్తు కాదని తేలిపోయింది. అదే గుండ లక్ష్మీదేవి, అప్పలసూర్యనారాయణలు గత ఎన్నికల్లో శంకర్ వెనుక ఉంటే చంద్రబాబు ఆదేశాలను గౌరవించినట్లు ఉండేది, అదే సమయంలో అఖండ మెజార్టీ వెనుక గుండ దంపతుల కష్టం ఉందన్న సందేశం కూడా వెళ్లుండేది. ఇప్పుడు ఈ రెండింటికీ వీరు దూరమవడం వల్ల నష్టపోయింది గుండ కుటుంబమే. దీన్ని వదిలేసి కేవలం సిటింగ్ ఎమ్మెల్యేను ఇరిటేట్ చేసే పనులకు పూనుకోవడం వల్ల రాబోయే రోజుల్లో లక్ష్మీదేవి ఏం సాధిస్తారో తెలీదు గానీ, కేడర్ మాత్రం నలిగిపోతున్నారు. అప్పలసూర్యనారాయణైతే కచ్చితంగా ఇలా వ్యవహరించివుండేవారు కాదు. 2014 ఎన్నికల్లో తనను పక్కన పెట్టినందుకు చంద్రబాబు మీద అలిగిన అప్పలసూర్యనారాయణ జిల్లాకు చంద్రబాబు ఎన్నిసార్లు వచ్చినా ఆయన్ను కలవడానికి వెళ్లలేదు. చివరకు కళా వెంకట్రావు కల్పించుకొని చంద్రబాబుకు అరసవల్లిలో కార్యక్రమం ఏర్పాటుచేసి, అప్పల సూర్యనారాయణ ఇంటికి తీసుకువెళ్లారు తప్ప, గుండ మాత్రం తన స్థాయి దిగి రాజకీయాలు చేయలేదు. అయితే లక్ష్మీదేవికి మాత్రం ఇది పరిపాటేనని గతంలో జరిగిన సంఘటనలు కూడా గుర్తుచేస్తున్నాయి. 1995 మున్సిపల్ ఎన్నికల్లో గుజరాతిపేట నుంచి వరం బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థి పెంటా లక్ష్మణశర్మ చేతిలో ఓడిపోయిన టీడీపీ అభ్యర్థిని వరం 1996లో టీడీపీలో చేరిన తర్వాత కూడా లక్ష్మీదేవి ప్రోత్సహించారు. ఎప్పుడైనా వరం మళ్లీ పార్టీ మారితే.. టీడీపీకి ఒకరుండాలన్న కోణం ఆమెది. ఇప్పుడు కూడా తాను యాక్టివ్‌గానే ఉన్నానన్న సంకేతాలు పంపడానికే ఇలా వ్యవహరిస్తున్నారని పార్టీ నేతలే చెబుతున్నారు.

# గీతా ప్రచారక సేవలకు ఆటంకం కలిగిస్తున్నారు

- కలెక్టర్‌కు విన్నవించిన సంస్థ ప్రతినిధులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని బొంతావారి వీధి ఉన్న గీతా ప్రచారక సమాజం సేవలకు ఆటంకం కలిగిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని సంస్థ ప్రతినిధులు కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో గీతా ప్రచారక సమాజం చేపడుతున్న కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తున్నవారిపై కార్యవర్గ ప్రతినిధులు ఏ.రామారావు, మురికయ్య, వెంకటరావు, ఎస్.గోపాలకృష్ణ ఫిర్యాదు చేశారు. భక్తుల ప్రయోజనార్థం చేపట్టిన నిర్మాణాలకు అడ్డంకులను సృష్టిస్తున్నారని వివరించారు. సంస్థ ద్వారా అనేక సంవత్సరాలుగా భక్తుల ఆధ్యాత్మిక అభివృద్ధికి పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ, అన్నదానం, ధార్మిక ఉపన్యాసాలు, సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు. భక్తుల తాకిడి అధికమవుతున్న దృష్ట్యా సంస్థకు దాత ఇచ్చిన స్థలంలో వంటశాల, శౌచాలయాల నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. నిర్మాణం చేపడుతున్న స్థలానికి తూర్పున ఉన్న నివాసి సదరు స్థలంలో తడి, పొడి వ్యర్థాలను వేస్తూ నిర్మాణానికి అడ్డు పడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ చర్యల వల్ల భక్తులకు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చర్యల వల్ల మహిళలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రజా ప్రయోజనానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని నిర్మాణాలకు ఆటంకం లేకుండా చూడాలని కోరారు.



## బదిలీ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగం తీవ్ర ఒడిదుడుకులకు గురి అవుతున్నదని దశాబ్దాల నుండి అమలులో ఉన్న గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాల వ్యవస్థకు తీవ్ర విఘాతం ఏర్పడుతుందని, తెలుగు మాధ్యమంలో విద్యార్థులు చదువు నేర్చుకునేందుకు అవకాశం కల్పించాలని, ఇటీవల బదిలీలు జరిగిన ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం ఏపీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో అధ్యక్షులు మజ్జి మదన్మోహన్ అధ్యక్షతన జరిగిన సబ్ కమిటీ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల స్థానంలో కేవలం ఒకటి రెండు తరగతులతో వేల సంఖ్యలో ఫౌండేషన్ పాఠశాలలు ఏర్పాటు చేశారని, తొమ్మిది రకాల పాఠశాలల ఏర్పాటు చేయడం సరైన విధానం కాదన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ నియామకం, మధ్యంతర భృతి, డిఏలు మంజూరు చేయడంలో తీవ్ర జాప్యం చేయడం తగదన్నారు. జిల్లా శాఖ అధ్యక్షులు మజ్జి మదన్మోహన్ మాట్లాడుతూ ఇటీవల బదిలీలు జరిగిన ఉపాధ్యాయులకు ఇంతవరకు జీతాలు చెల్లించకపోవడం శోచనీయమని, వారికి తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డి సరస్వతి మాట్లాడుతూ విద్యారంగాన్ని ప్రయోగాలకు గురిచేస్తూ నిత్యం ఒత్తిడికి గురి చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌వి. అనిల్‌కుమార్, జిల్లా కార్యదర్శులు దాసరి రామ్మోహనరావు, వి.నవీన్‌కుమార్, చావలి శ్రీనివాస్, పి.తిరుమలరావు, ఉపాధ్యక్షులు పి అప్పలనాయుడు, బి ఢిల్లేశ్వరరావు, ఎస్ చాణుక్య, రాష్ట్ర జి.రాజేష్, సీనియర్ నాయకులు పి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు దంపతులు సోమవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతానికి కిషన్‌రెడ్డి తగిన సూచనలు చేశారని సిరిపురం వివరించారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మధ్యాహ్న భోజన పథకంలో ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల 6నెలల పెండింగ్ బిల్లులు, వంట కార్మికులకు 6 నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్. అమ్మన్నాయుడు ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కె.సుశీల, బి.ఉత్తర డిమాండ్ చేసారు. ఈమేరకు సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలలలో మధ్యాహ్న భోజన పథకం బిల్లులు, వేతనాలు గత ఆరు నెలలు నుండి చెల్లించలేదన్నారు. అప్పులు చేసి వండిపెట్టిన కళాశాలల వంట కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వినతిపత్రం అందించినవారిలో యూనియన్ నాయకులు ఎ.రాధ, వి.లక్ష్మి, ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు డి.చందు, పి.పవిత్ర పాల్గొన్నారు.



## ఉత్తర్వులపై పునఃసమీక్ష జరపండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలోని పాఠశాలల ప్రాంగణాల్లో అనధికార వ్యక్తుల ప్రవేశాలు నిషేదిస్తూ ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టరేట్ ఉత్తర్వులు జారీ చేయడం బాలల హక్కుల పరిరక్షణ ఉల్లంఘనలుగా భావిస్తున్నామని చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి, న్యాయ సలహాదారు కె.ప్రవీణలు తెలిపారు. సోమవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో వీరు మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులను, స్కూల్ మేనేజ్మెంట్ ప్రతినిధులను, ముందస్తు ప్రభుత్వ అనుమతులు పొందిన వ్యక్తులు, సంస్థలను మాత్రమే అనుమతిస్తూ తీసుకున్న ప్రభుత్వ నిర్ణయమన్నారు. అలాగే రాజకీయ పార్టీల సంస్థలకు చెందినవారిని నిరాకరించడం హర్షణీయమన్నారు. కానీ ఈ ఉత్తర్వుల్లో బాలల హక్కుల సంఘాలు, వారి సంక్షేమాన్ని, ఆరోగ్య పరిరక్షణకు, హక్కులను కాంక్షించి నిత్యం ఎన్నో అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేసే ప్రభుత్వ ద్రవ్య సహాయంతో, సహాయం లేని ఇతర ప్రభుత్వేతర(ఎన్జీఓ)సంస్థల ప్రవేశంపై స్పష్టమైన సమాచారం లేకపోవడం బాలల హక్కుల ఉల్లంఘనగా భావించాల్సి ఉందన్నారు. అలాగే నిత్యం ఎన్నో సమస్యలతో నెట్టుకొస్తున్న విద్యార్థుల కష్టనష్టాలు పూర్తి స్థాయిలో సంభందిత శాఖ ఉన్నతాధికారుల దృష్టికి చేరాలంటే రాష్ట్రంలో ముందస్తు అనుమతులు కలిగిన రిజిస్టర్డ్ బాలల హక్కుల సంఘాలను అనుమతించాలని కోరారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న వారితోనే ఇది సాధ్యమవడంతోపాటు రాష్ట్రంలోని కోట్లాదిమంది విద్యార్థులకు శతశాతం హక్కుల పరిరక్షణకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకొని ఈ ఉత్తర్వులపై పునఃసమీక్షలు చేయాలని వారు కోరారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు సదాశివుని కృష్ణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టి.భీమారావు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కోరారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారు సమర్పించారు. రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించాలని, నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారే జర్నలిస్టు వృత్తిలో ఉన్నందున అందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని, హెల్త్‌కార్డులు, ఆరోగ్య బీమా అందించాలని, మీడియ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, జర్నలిస్టులకు సంబంధించిన అన్ని కమిటీలను పునరుద్ధరించాలని ఈ కమిటీలలో ఏపీడబ్ల్యూజేఎఫ్, ఏపీబీజేఏలకు స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మీడియా అకాడమీని, గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేయాలన్నారు. జర్నలిస్టులకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక బీమా జర్నలిస్టులకు వర్తింపజేయాలని కోరారు. రైళ్లలో రాయితీ కొనసాగించాలని, ఏసీ బస్సుల్లో రాయితీ కల్పించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. సమాచారశాఖకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.నర్సింగరావు, ఉపాధ్యక్షుడు డి.నందికేశ్వరరావు, నరసన్నపేట నియోజకవర్గకమిటీ అధ్యక్షుడు కంగు మన్మథరావు, ఏపీబీజేఏ ఉపాధ్యక్షుడు ఎం.ప్రసాదరావు, జిల్లా ప్రతినిధులు శేఖర్, శివశంకర్, ఆర్.సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## మోదీ వ్యాఖ్యలు హాస్యాస్పదం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పార్లమెంట్‌లో జరుగుతున్న విషయాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యాలు హాస్యాస్పదంగా ఉందని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి అన్నారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పహల్గాం గతంలో ఎందరో మహిళలు తమ సింధూరాలను కోల్పోయారని ఒక్క ఉగ్రవాదినైనా ఎన్డీఏ ప్రభుత్వం హయాంలో మట్టు పెట్టగలిగారా అని ఆమె ప్రశ్నించారు. ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో ఆర్థిక, రక్షణ వ్యవస్థలతో పాటు విదేశాంగ విధానం కూడా పూర్తిగా నిర్వీర్యమైందని విమర్శించారు. ఎన్‌డీఏ ప్రభుత్వం వైఖరితో ప్రపంచ దేశాల ముందు తలదించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. సీజ్‌ఫైర్ అమెరికా నిలుపుదల చేసిందని చెబుతోందని ఇది నిజమా.. కాదా అని రాహుల్‌గాంధీ ప్రశ్నకు సమాధానం చెప్పాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో నెహ్రూ, ఇందిరాగాంధీ వంటి ప్రముఖులను గురించి ప్రస్తావించుకోవడంతోనే మోదీ, మంత్రులు కాలక్షేపం చేస్తున్నారని తెలిపారు. సింధూర్‌లో ఎన్‌డీఏ ప్రభుత్వం తుస్సుమందన్నారు. 2014 నుంచి ఎన్డీఏ ప్రభుత్వం విదేశాంగ విధానంలో పూర్తిగా విఫలమైందని వివరించారు. పెహల్‌గామ్ దాడి తరువాత పాకిస్తాన్ మిలటరీ జనరల్‌ను అమెరికా వైట్‌హౌస్‌కి పిలిచి డిన్నర్ ఇవ్వడం దారుణమన్నారు. మోదీ కూడా ఒక రాజకీయ పార్టీ తరపున అమెరికా వెళ్లి ప్రచారం చేయడం ఎంత వరకు సమంజసమని పేర్కొన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వానికి ఈ ఐదేళ్లలో ఎంపీల సంఖ్యాబలం తక్కువగా ఉందని, అయినా కూడా కూటమి ప్రభుత్వం ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాలు కోసం ప్రశ్నించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనేది లేదని, అది కేవలం తెలుగుదేశం ప్రభుత్వం మాత్రమేనని తెలిపారు. కూటమిలో ఎక్కడా బీజేపీ, జనసేన పార్టీలు కనిపించే పరిస్థితి లేదన్నారు. అసలు పవన్‌కళ్యాణ్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి తనది ఒక సలహా అని కృపారాణి చెప్పారు. రాష్ట్రంలోని అన్ని జైళ్లలో అధునాతన సౌకర్యాలు కల్పించాలని ఈమె చెప్పారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రకరకాల కేసుల పేరుతో ప్రతిపక్ష నాయకులను జైళ్లలో వేస్తోందని, అనుకోని సందర్భంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వస్తే వీరిని కూడా జైళ్లలో వేసే పరిస్థితి ఉంటుందన్నారు. కాబట్టి జైళ్లను అధునాతనంగా తయారు చేసే పథకాన్ని అధికార ప్రభుత్వం ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గాదెం వెంకట త్రినాథరావు, రెళ్ల సురేష్, కిల్లి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.